ఈనాడు
సిద్దిపేట
గురువారం అక్టోబరు 17, 2024

తూప్రాన్ — తూప్రాన్ - సంగారెడ్డి వయా శివ్వంపేట, నర్సాపూర్ — శివ్వంపేట

పెడచెవిన పెట్టాడు.. ప్రాణాలు తీశాడు

అత్యంత సమీప బంధువులైన ఎనిమిది మంది మంగళవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై ఉల్లాసంగా గడిపారు. ఆ ఆనంద క్షణాలను గుర్తుచేసుకుంటూ బుధవారం మధ్యాహ్నం కారులో స్వస్థలం భీమ్లా తండాకు బయలుదేరారు. మార్గం మధ్యలో నామ్‌సింగ్ కారు వేగంగా నడుపుతుంటే వద్దని వారించారు. అయినా అతను వినలేదని ఫలితంగా ఏడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. మరో పది నిమిషాల్లో స్వస్థలం చేరుకుంటారనగా ఈ తీవ్ర విషాదం చోటుచేసుకోవడం గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది.

న్యూస్‌టుడే, శివ్వంపేట, తూప్రాన్, వెల్దుర్తి:

అప్పటి వరకు వారంతా పండుగ సంతోషంలో మునిగి తేలారు. ఒకే పేగు బంధంతో పుట్టి పెరిగిన ఏడుగురు క్షణాల్లో జరిగిన ప్రమాదంలో విగతజీవులుగా మారారు. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామ శివారులో జరిగిన కారు ప్రమాదం మూడు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరో 5 నిమిషాల్లో ఇళ్లకు చేరుకునే క్రమంలోనే ఈ ప్రమాదం జరిగింది. దనావత్ శివరామ్, దుర్గి దంపతులకు ముగ్గురు కుమార్తెలు శాంతి, ప్రమీలా, అనిత, కొడుకు ధను ఉన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లిలో నివాసం ఉండే రెండో కుమార్తె ప్రమీలా ఇంట్లో ముత్యాలమ్మ పండుగ నిర్వహించారు. ఇందులో పాల్గొని తిరిగి వస్తుండగా.. శివరామ్, దుర్గి, వీరి కుమార్తె అనిత, ఆమె కుమార్తెలు శ్రావణి, హిందు, నామ్‌సింగ్, ఆయన భార్య శాంతి, కుమార్తె మమతలు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. కారు నడుపుతున్న నామ్‌సింగ్ ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డాడు.

కుమారుడికి చెప్పకుండా..

శివరామ్ తన కొడుకు ధనుకు చెప్పకుండానే ఇద్దరు అక్కలు, వారి పిల్లలతో కలిసి శుభకార్యానికి వెళ్లారు. దీంతో ధను, భార్య రాజేశ్వరి వారి ముగ్గురు పిల్లలు ఇంటి వద్దే ఉన్నారు. ఘటన స్థలానికి వచ్చిన ధను.. తల్లిదండ్రులు, అక్కలు, కోడళ్ల మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించాడు.




వాగులో పడటంతోనే..

వాగులో కారు పడి మునగడంతో డోరులు తెరుచుకోక ఏడుగురు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. రోడ్డుపై పడితే ప్రాణాలు పోయేవి కాదని స్థానికులు భావిస్తున్నారు. కల్వర్టు వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

భూమి అమ్మి.. కారు కొని..

నామ్‌సింగ్ తనకున్న భూమిలో కొంత అమ్మి ఇటీవలే పాత కారు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి దేవాలయాలు, శుభకార్యాలకు వెళ్తున్నాడు. తల్లి, చెల్లె మృత్యువాత పడడం, తండ్రి తీవ్రగాయాల పాలు కావడంతో కొడుకు రాజేశ్ దిక్కుతోచని స్థితి నెలకొంది.


నామ్‌సింగ్



మధ్యాహ్నం 2-2.30: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపురంలో బయలుదేరిన సమయం.

3.45-3.50: ప్రమాదం జరిగింది.

గ్రామస్థుల గుర్తింపు: సాయంత్రం 5 గంటల ప్రాంతంలో

మృతదేహాలు వెలికితీసింది: 6 గంటల ప్రాంతంలో..

ఇరుకు కల్వర్టు..

ప్రమాదం చోటు చేసుకున్న రహదారి విస్తరణ పనులకు గత ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. కొన్ని నెలల క్రితం ఈ పనులను అధికారులు ప్రారంభించారు. ఈ రోడ్డును ఉసిరికపల్లి చౌరస్తా నుంచి వెల్దుర్తి రోడ్డును పాంబండ వరకు విస్తరించేందుకు పనులు చేపట్టారు. ఒక వరుస రోడ్డును విస్తరణ చేస్తున్నారు. కానీ ప్రమాదం చోటు చేసుకున్న కల్వర్టును మాత్రం విస్తరించలేదు.


పొక్లెయిన్‌తో కారును వెలికితీస్తూ..

మిన్నంటిన రోదనలు..

తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. కొంత మంది వృద్ధులు సొమ్మసిల్లి పడిపోయారు. శివ్వంపేట మాజీ జడ్పీటీసీ సభ్యుడు పబ్బ రమేశ్‌గుప్తా, తూప్రాన్ పురపాలిక మాజీ ఛైర్మన్ బొంది రవీందర్‌గౌడ్ ఆస్పత్రికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అతివేగమే కారణం: ఎస్పీ

ప్రమాదానికి అతివేగమే కారణమని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కారు నడుపుతున్న నామ్‌సింగ్ మద్యం తాగాడా లేదనే విషయమై డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపడతామన్నారు.


విలపిస్తున్న బంధువులు

రూ.5 లక్షల పరిహారం ప్రకటించాలి: హరీశ్‌రావు

నర్సాపూర్: ఉసిరికపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని.. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. • కారు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వం కూడా వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డయాలసిస్ రోగులకు ఊరట!

కొత్తగా ఐదు పడకలు మంజూరు

న్యూస్‌టుడే, సిద్దిపేట: సిద్దిపేట సర్వజన ఆసుపత్రి ఆవరణలో కొనసాగుతున్న డయాలసిస్ కేంద్రానికి కొత్తగా ఐదు పడకలు మంజూరు అయ్యాయి. ఫలితంగా ఎంతో మంది వేచి చూస్తున్న రోగులకు ఊరటగా మారనుంది. సేవల విస్తృతికి అడుగులు వేసినట్లయింది.


సిద్దిపేటలోని డయాలసిస్ కేంద్రం

కేంద్రం పరిధిలో ఇలా..

ఇప్పటి వరకు నిర్వహించిన సెషన్స్ (కేసులు): 72,799

పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది: 9 మంది

సిద్దిపేటలో 2017 ఆగస్టు 17న డయాలసిస్ కేంద్రం ఏర్పాటైంది. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత జిల్లాల పరంగా మొదటిసారిగా సిద్దిపేటలో ఐదు పడకలతో ప్రారంభించారు. డిమాండు దృష్ట్యా 2019లో పది పడకలకు పెంచారు. ప్రస్తుతం 110 మంది చికిత్స పొందుతుండగా.. మరో 100 మంది సేవలు పొందేందుకు ఎదురుచూస్తున్నారు. మరోవైపు పడకలకు అనుగుణంగా సిబ్బంది చికిత్సలు అందించాల్సి వస్తోంది. ఒక్కో రోగి తీవ్రత మేర వారానికి రెండు నుంచి మూడుసార్లు కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. దీంతో గతంలో నమోదైన వారికే ప్రాధాన్యంగా సేవలు కొనసాగుతున్నాయి. ఫలితంగా కొత్త వారిని చేర్చుకునే పరిస్థితి ఉండటం లేదు. ఈ తరుణంలో తాజాగా ఐదు పడకలు మంజూరు కావడంతో మరో 50 మంది వరకు చికిత్స అందించే అవకాశం ఏర్పడింది. దీంతో పాటు అదనంగా ఐదింటిని అందుబాటులోకి తెస్తే మిగిలిన వారందరికి మేలు చేకూరనుంది. పడకలు పెరిగిన నేపథ్యంలో సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది.

ప్రతి మూడు నెలలకు..

డయాలసిస్ బాధితులను ప్రతి మూడు నెలలకోసారి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుంటారు. స్థానికంగా టెలీ మెడిసిన్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. నిమ్స్ వైద్య నిపుణులతో వీడియోకాల్ ద్వారా మాట్లాడిస్తూ వారిలో ధైర్యం నింపుతున్నారు. దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్‌లో కేంద్రాలు కొనసాగుతున్నప్పటికీ. . ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు ఇక్కడే సేవలు పొందుతున్నారు. ప్రైవేటు కేంద్రాల్లో ఒక్కమారు(సెషన్) డయాలసిస్ చేయించుకుంటే రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. ఇక్కడ మాత్రం పూర్తి ఉచితంగా అందుతోంది.

త్వరలోనే అందుబాటులోకి: హరీశ్‌రావు, ఎమ్మెల్యే

రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి కేంద్రం సిద్దిపేటలో ఏర్పాటైంది. బాధితులు ఒకప్పుడు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేది. వారి బాధలను గుర్తించి చర్యలు తీసుకున్నాం. ఉచితంగా సాయం చేయడం ద్వారా రోగులకు ఊరట లభిస్తుంది. త్వరలోనే కొత్త పడకలు అందుబాటులోకి రానున్నాయి.

కేంద్రీయ విద్యాలయాన్ని అందుబాటులోకి తేవాలి

సిద్దిపేట టౌన్, అర్బన్, న్యూస్‌టుడే: సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో నిర్మాణం పూర్తయిన కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని పది రోజుల్లో అందుబాటులోకి తేవాలని తహసీల్దార్ సలీమ్‌మియా, ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్‌ను జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. ఆవరణలోని క్రీడా మైదానాన్ని సిద్ధం చేసి ఆవరణ పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. సిద్దిపేట పట్టణం, అర్బన్ మండలాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయ భవన పరిశీలన అనంతరం మిట్టపల్లిలోని సుడా లేవుట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెంచర్‌లో మొత్తం 111 ప్లాట్లలో ఇప్పటివరకు విక్రయం కాని 98 ప్లాట్ల ధరలు తగ్గించి మరోసారి వేలం పాటకు సిద్ధం చేయాలని బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌కు సూచించారు. అనంతరం అదే గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం చిన్నకోడూరు మండలం రామంచలో 10 ఎకరాల్లో నిర్మించిన సుడా రిసార్టు, పార్కును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్లు సలీమ్‌మియా, జయలక్ష్మి, డీటీసీపీవో వందనం, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


కేవీ ఆవరణ పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యం: సీపీ

నంగునూరు, న్యూస్‌టుడే: పోలీస్ అధికారులకు, సిబ్బందికి విధి నిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్యం అంతే ముఖ్యమని సీపీ డాక్టర్ అనూరాధ పేర్కొన్నారు. బుధవారం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా పోలీస్ సిబ్బందికి వార్షిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఆరోగ్య పరీక్షల కార్యక్రమం జిల్లాలోని 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వారం రోజులపాటు కొనసాగుతుందన్నారు. అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు సిద్దిపేట రూరల్, రాజగోపాలపేట ఎస్సైలు అపూర్వరెడ్డి, ఆసిఫ్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ అనూరాధ

అన్నదాతలకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి పారదర్శకంగా, సమగ్ర ప్రణాళికతో ధాన్యం సేకరణ చేపట్టాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. వరి ధాన్యం సేకరణ-మద్దతు ధరపై కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, ఏవోలు, ఏఈవోలకు కలెక్టరేట్‌లో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..జిల్లాలో గతంలో మాదిరే 417 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమస్యలుంటే రైతులు కంట్రోల్ రూం నంబర్లలో (79950 50808, 79950 50809) సంప్రదించాలన్నారు. గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, డీఏవో రాధిక, డీఎస్‌వో తనూజ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమాలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత పిలుపునిచ్చారు. సిద్దిపేటలో బుధవారం సంఘం మహాసభ నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పత్తి రైతుల కష్టం ఫలించేనా!

న్యూస్‌టుడే, గజ్వేల్

సీసీఐ(భారత పత్తి సంస్థ) పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేస్తుండటంతో రైతుల ఆశలు నీరుగారిపోతున్నాయి. ఇప్పటిదాకా 16 మిల్లులు మాత్రమే అధికారులు నోటిఫై చేశారు. మిగతా ఆరింటి విషయంలో సందిగ్ధం నెలకొంది. మరో వారం పదిరోజులు దాటితే కానీ తెలియదని అధికారులు చెబుతున్నారు.

దీపావళి, నోముల పండుగలు వస్తుండటంతో రైతులు ఖర్చుల కోసం కొద్దికొద్దిగా పత్తిని సేకరించి విక్రయిస్తున్నారు. ధర పెరుగుతుందేమోనని ఆశతో పత్తిని చేన్లలోనే ఉంచుతున్నారు. పూసిన పత్తిని సకాలంతో సేకరించకపోవటంతో చేన్లలోనే కారిపోతుంది. చిరు జల్లులకు తడిసిపోయి రంగు మారుతుంది. మరోవైపు సేకరిస్తే ధర దక్కుతుందో లేదోనని అనుమానం, చేనులో ఉంచితే పాడిపోతుండటంతో దిగాలు చెందుతున్నారు. ఈ సారి ప్రభుత్వం పత్తికి క్వింటాకు రూ.7121 మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే. ముందే ప్రైవేటులో విక్రయిస్తే క్వింటాపై రూ.1000కి పైగా నష్టపోతామని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గజ్వేల్ శివారులో చేనులోనే పత్తి

పత్తి సాగు:	1.08 లక్షల ఎకరాలు
పొడవు రకం(క్వింటా)	రూ. 7521
మధ్య రకం(క్వింటా)	రూ. 7121
జిన్నింగ్ మిల్లులు:	24
సీసీఐ నోటిఫై చేసింది:	16

జిల్లాలో ఈ సారి 1.08 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. దాదాపు 15 లక్షల క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. పత్తి సేకరణ ప్రారంభమైన నేపథ్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే ధర నిలకడగా ఉంటుందని లేకుంటే ప్రైవేటు వ్యాపారులు నిర్ణయించిందే ధరగా మారిపోయి రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

తేమ పేరుతో వెనుకంజ

ప్రస్తుతం విపణికొస్తున్న పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందని, 12 శాతం లోపు ఉంటేనే సీసీఐ కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని, ఈ కారణంగానే వెనుకంజ వేస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలు, మంచు కారణంగా ప్రస్తుతం పత్తిలో 15 నుంచి 25 వరకు తేమ శాతం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అందుకే ధర పలకడం లేదంటున్నారు. అయితే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పత్తిని ఆరబెట్టి తీసుకొచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రైతులు చెబుతున్నారు. సీసీఐ లేకపోవటంతో ప్రైవేటు వ్యాపారులు ఎంత ధర చెబితే అంతకే అమ్మాల్సి వస్తుందని వాపోతున్నారు.

సీసీఐ కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో ఆందోళన

శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం

–నాగరాజు, డీఏవో

జిల్లాలో సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు ఇప్పటిదాకా 16 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేశారు. మిగతా వాటిని కూడా త్వరగా చేసి ఏర్పాటు చేసేలా శాఖాపరమైన చర్యలు చేపడుతున్నాం.

17న సిద్దిపేటకు మంత్రి రాక

హుస్నాబాద్: హుస్నాబాద్‌కు చెందిన టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఈ నెల 17న సిద్దిపేటలోని టీటీసీ భవనంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

విద్యుత్తు శాఖలో బదిలీలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో డీఈ స్థాయి నుంచి జూనియర్ లైన్‌మెన్ వరకు బదిలీలు జరిగినట్లు ఎస్ఈ చంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట డీఈగా పని చేసిన మహేష్‌కుమార్ హైదరాబాద్‌కు వెళ్లగా ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి రామచంద్రయ్య వచ్చి బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిపై హుస్నాబాద్ డీఈగా క్రిష్ణయ్య హైదరాబాద్ నుంచి వచ్చారు. సిద్దిపేట టెక్నికల్ ఏడీఈగా ముస్తాయ్య, చేర్యాలకు వెంకటి, బెజ్జంకికి సుధీర్‌బాబు, దుబ్బాకకు గంగాధర్, హుస్నాబాద్ ట్రాన్స్‌ఫార్మర్ ఏడీఈగా పండరి వచ్చారు. ఏఈలు 25 మంది, జూనియర్ అకౌంట్ అఫీసర్లు-12 మంది, సీనియర్ అసిస్టెంట్లు 20 మంది, జూనియర్ అసిస్టెంట్లు 26 మంది, ఫోర్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు 150 మంది సిబ్బంది బదిలీ జరిగినట్లు ఎస్ఈ తెలిపారు. దుబ్బాక ఏడీఈ గంగాధర్ బాధ్యతలు చేపట్టారు.

60 మీటర్ల రింగు రోడ్డు వేయలేరా!

ఆగిన పనులతో ఇబ్బందులు


గజ్వేల్ శివారు సంగాపూర్ రోడ్డులో నిలిచిన పనులు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంతో పాటు వాణిజ్య బాటలు వేసేందుకు నిర్మించిన రింగు రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రయోజనం లేకుండా పోతుంది. మొత్తం రూ.230 కోట్ల భారీ వ్యయంతో 23 కిలోమీటర్ల మేర పనులను గత ప్రభుత్వం చేపట్టింది. మొత్తం పూర్తవగా రైల్వే వంతెన వద్ద మిగిలిన 1.6 కిలోమీటర్ల రోడ్డును ఆ శాఖ పూర్తి చేసేందుకు ఇటీవలే పనులు ప్రారంభించింది. శ్రీగిరిపల్లి నుంచి వయా ఆర్ అండ్ ఆర్ కాలనీ, సంగాపూర్ మీదుగా తూప్రాన్ రోడ్డును కలిసి ఒక వైపు రోడ్డులో సంగాపూర్ వద్ద కేవలం 60 మీటర్లు మాత్రమే మిగిలిపోయింది. ఈ మూరెడు రోడ్డు పూర్తి చేస్తే ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి జాతీయ రహదారి తూప్రాన్ మీదుగా వెళ్లే భారీ వాహనాలు గజ్వేల్‌కు రాకుండానే బైపాస్ రింగు రోడ్డు మీదుగా వెళ్తాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గజ్వేల్

‘అసత్య ప్రచారాలతో తప్పుదోవ పట్టించొద్దు’

గజ్వేల్, జగదేవపూర్, న్యూస్‌టుడే: అసత్య ప్రచారాలతో తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడమే కేసీఆర్ కుటుంబం లక్ష్యంగా మారిపోయిందని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. గజ్వేల్‌లోని ఆర్ అండ్ ఆర్ కాలనీ బంజేరుపల్లికి చెందిన పలువురు, జగదేవపూర్ మండల పరిధి తీగుల్‌కు చెందిన భారాస నాయకులు, కార్యకర్తలు బుధవారం ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017లో భారాస అధికారంలో ఉండగానే రామగుండం రాడార్ కేంద్రానికి అనుమతిచ్చారని, ఆ నాయకులు ఇప్పుడు రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఇంకా ఎన్నేళ్లు తెలంగాణ సెంటిమెంట్‌తో లబ్ధి పొందుతారని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకున్నా వారిలో మార్పు రావడం లేదన్నారు. అనంతరం ఆయన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న నర్సారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


నంగునూరు, న్యూస్‌టుడే: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని, అందుకు ఈసారి బాసర ట్రిపుల్ ఐటీకి ఎక్కువమంది విద్యార్థులు ఎంపిక కావడం నిదర్శనమని డీఈవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి నర్మెట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాలో మొదటి సారిగా నిర్వహించిన స్నాతకోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచి ప్రతిరోజు విద్యార్థులను పాఠశాల పంపిస్తే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తామన్నారు. హిందీ పండిట్ పోస్టును భర్తీ చేయాలని ఎంఈవో దేశిరెడ్డి డీఈవోను కోరగా పంపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

వినికిడి లోపం గుర్తించే పరికరాలు ప్రారంభం

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ సర్వజన ఆసుపత్రిలో ఈఎన్‌టీ విభాగంలో వినికిడి లోపాన్ని గుర్తించే పరికరాలను కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శాంతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన పరికరాల ద్వారా వినికిడి లోపాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా శస్త్రచికిత్సలు చేసేందుకు దోహదపడుతుందన్నారు. ఈఎన్‌టీ వైద్యులు నాగరాజు, ప్రణీత్‌కుమార్, అమిత్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ అనస్తీషియా దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్, సూపరింటెండెంట్, వైద్యులతో కలిసి కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. విభాగాధిపతి అనుపమ, డిప్యూటీ సూపరింటెండెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. చందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

త్రిగుళ్ల ప్రభాకర్‌శర్మ కన్నుమూత



జగదేవపూర్, న్యూస్‌టుడే: మండలంలోని తిగుళ్లకు చెందిన బ్రహ్మశ్రీ త్రిగుళ్ల ప్రభాకర్ శర్మ(84) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం దివంగతులయ్యారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయుడిగా సేవలందించిన ఆయన ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. వీరు సనాతన వైదిక కార్యక్రమాల్లో నిష్ణాతులు. రాష్ట్రంలోని అనేక ఆలయాల్లో వందకు పైగా ప్రతిష్ఠలు నిర్వహించి ధర్మ వ్యాప్తికి దోహదపడ్డారు. మర్కుక్ పాండురంగాశ్రమంలోనూ విశేష సేవలందించారు.

శత శాతం ఉత్తీర్ణత రావాలి: డీఐఈవో

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఐఈవో రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా వారిని సన్నద్ధం చేయాలని అధ్యాపకులకు సూచించారు. ప్రిన్సిపల్ శారద, అధ్యాపకులు రఘువీర్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్స్ తగ్గుముఖం

న్యూస్‌టుడే, జహీరాబాద్: వర్షాధారంగా సాగు చేసే వాణిజ్య పంటల్లో ప్రధానమైంది సోయాబీన్స్. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు సాగు చేసేవారు. సమయానుకూలంగా వర్షాలు కురవకపోవడం, విపణిలో గిట్టుబాటు ధర లభించక పోవడంతో సాగు చేసే రైతుల సంఖ్య తగ్గుతోంది. దానికి బదులుగా పత్తి పంటపై ఆసక్తి చూపుతున్నారు. దాదాపు రెండు నెలలుగా తరచుగా కురుస్తున్న వర్షాలతో ఈ ఏడు వేసిన కొద్దిపాటి పంట సైతం దెబ్బతినటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, జిల్లాలోని విపణులు వెలవెల బోతున్నాయి. సాధారణానికి భిన్నంగా గత రెండు, మూడేళ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తోంది.



విపణిలో సోయాబీన్స్ ధాన్యం

సంవత్సరం	రైతులు	ఎకరాలు
2022	40514	76442
2023	20500	41756
2024	15000	35000

మహారాష్ట్రలో మిల్లులు ఎక్కువ

సోయాబీన్ ధాన్యాన్ని నూనె మిల్లుల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. నూనె తీయడంతో పాటు పిండిని కోళ్ల దాణాకు ఉపయోగిస్తుంటారు. మిల్లుల ఏర్పాటుకు మహారాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వరకు రాయితీ ఇవ్వడంతో అక్కడ ఎక్కువగా ఉన్నాయి. మన రాష్ట్రంలో జహీరాబాద్, రామాయంపేట, కరీంనగర్‌లో ఒక్కొక్కటి చొప్పున, హైదరాబాద్‌లో రెండు ఉన్నాయి. జహీరాబాద్‌కు కేవలం వంద కిలోమీటర్ల దూరంలోనే మహారాష్ట్రలో మిల్లులు ఉండటంతో అటు ఎక్కువగా సోయాబీన్స్ తరలిస్తారు.



రాయితీలు ప్రకటించాలి:

అతివృష్టి, అనావృష్టిలతో నాలుగేళ్లుగా సోయాబీన్స్ పంట దిగుబడులు పడిపోతున్నాయి. నష్టాలతో సాగు చేయలేక ఇతర పంటల వైపు మళ్లుతున్నారు. ప్రభుత్వం రాయితీలు ప్రకటించి ఆదుకోవాలి. ఈ సంవత్సరం దాదాపు రెండు నెలలుగా ప్రతిరోజు వాన కురుస్తోంది. కనీసం పెట్టుబడులైనా రావడం లేదు. ప్రభుత్వం పరిహారం అందించాలి.

– గోవింద్‌రెడ్డి, బూచినెల్లి


రూ.144 కోట్ల మద్యం తాగేశారు


- గతేడాది కంటే విక్రయాలు తక్కువ
- సంగారెడ్డి జిల్లాలో మాత్రమే ఎక్కువ





మెదక్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సాధారణంగా పండగ వచ్చిందంటే ముక్క, చుక్క ఉండాల్సిందే. దసరా లాంటి పెద్ద పండగ వస్తే మద్యం తప్పనిసరి. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో గతేడాది దసరా పండగ సీజన్‌ను ఈసారితో పోల్చితే సంగారెడ్డి జిల్లాలో మాత్రమే మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగాయి. మిగతా మూడు జిల్లాల్లో తక్కువ అమ్ముడయ్యాయి. మెదక్ జిల్లాలో కేవలం రెండు రోజుల లోనే రూ. 13.43 కోట్ల విలువైన మద్యాన్ని డిపో నుంచి వ్యాపారులు తీసుకెళ్లారు. మెదక్ జిల్లాలో 48 వైన్స్‌లు, 3 బార్లు ఉన్నాయి. రూ. 59.48 కోట్ల లక్ష్యం పెట్టుకోగా సగమైనా దాటలేదు.

- వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలు, 7 బార్లు ఉన్నాయి. మద్యం గొలుసు దుకాణాలు, ధాబాల్లో విచ్చలవిడిగా అమ్మారు.
- ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అమ్మవారి దీక్షలు, శనివారం నాడు పండగ రావడంతో సిద్దిపేట జిల్లాలో అమ్మకాలు తగ్గాయని భావిస్తున్నారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల జోరుతో పెరిగాయి. గతంతో పోల్చితే రూ. 4.62 కోట్ల మేర ఆదాయం తగ్గింది.
- సంగారెడ్డి జిల్లాలో నిరుడు దసరా కంటే ఈసారి ఐఎంఎల్ లిక్కర్, బీర్ల ద్వారా జిల్లాకు రూ. 2.17 కోట్ల ఆదాయం ఎక్కువ సమకూరింది. 3.66 శాతం వృద్ధి నమోదైంది. ఈ జిల్లాలో 5 ఆబ్కారీ స్టేషన్‌లు, 101 దుకాణాలు, 34 బార్ రెస్టారెంట్లు ఉన్నాయి.









ఫోన్‌లో ఓటు చూసుకోండి



వివరాలు చూపించే పేజీ

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణం: త్వరలోనే స్థానిక సంస్థ ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిమిత్తం గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సమయం ఇచ్చారు. తుది జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఓటరు జాబితాలో పేరు ఉందీ లేనిదీ సెల్‌ఫోన్‌లో చూసుకోవచ్చు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూస్తే తెలుస్తుంది. tsec.gov.in అని వెబ్‌సైట్‌లో ఎలక్షన్ కమిషన్ పేజీ తెరుచుకుంటుంది. ఫైనల్ రోల్స్ ఐచ్ఛికం కనిపిస్తుంది. జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేయగానే మరో పేజీ కనిపిస్తుంది. వివరాలు నమోదు చేసిన తర్వాత పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా కనిపిస్తుంది. వార్డుల వారీగా అందులో పేరు చూసుకోవచ్చు. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పథకాలతో పేదరికం దూరం



మెదక్ టౌన్, న్యూస్‌టుడే: సమాజంలో పేదరికం పెరిగితే అశాంతి, అసమానతలతో ప్రజల మధ్య వైరుధ్యాలు చోటుచేసుకుంటాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త చట్టాల ద్వారా, పథకాలతో, బడ్జెట్ కేటాయింపులతో పేదరికాన్ని నిర్మూలించేందుకు లక్ష్యం ఏర్పాటు చేసుకొని ప్రణాళికలు రచిస్తాయి. కరోనా వ్యాప్తి చెందిన సంవత్సరాల నుంచి ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఇల్లు, పారిశుద్ధ్యం, బడి కెళ్లడం, పౌష్టికాహారం తదితరాంశాలను గణించి పేదరికం సూచికలను తయారుచేస్తున్నారు. 2023లో నీతి ఆయోగ్ ప్రకటించిన సూచికల మేరకు వికారాబాద్ జిల్లాల్లో పేదరికం .. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్‌లతో పోల్చితే ఎక్కువగా ఉంది. తెలంగాణ జిల్లాల్లోని పేదరికం ప్రకారం వికారాబాద్ 29వ స్థానంతో అథమంలో ఉంది. మొదటి పది ఉత్తమ స్థానాల్లో మిగతా మూడు జిల్లాలున్నాయి. నేడు 'పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా కథనం.

అట్టడుగు జీవితం నుంచి యజమాని వరకు..



కొండల్‌రెడ్డి

గుమ్మడిదల, న్యూస్‌టుడే: కొద్దిపాటి పొలంలో వ్యవసాయంతో కుటుంబ ఖర్చులు గడిచేవి కావు. పండగలైనా ఒక్కోసారి సరైన ఆహారమే దొరికేది కాదు. అలాంటి స్థితిలో సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన లింగాయిగారి కొండల్‌రెడ్డి.. వాహనాల మెకానిజం నేర్చుకున్నారు. ఓవైపు చదువుకుంటూనే తండ్రికి పొలంలో చేదోడువాదోడుగా ఉంటూనే ద్విచక్ర వాహనాలపై మోజుతో వీలైన సమయంలో మెకానిజం నేర్చుకున్నారు. రెండు సంవత్సరాల్లో కష్టపడి సొంతంగా మరమ్మతులు చేయడంలో అనుభవం పొందారు. దోమడుగులో మెకానిక్ దుకాణం ప్రారంభించారు. వాటి సంపాదనతో అభివృద్ధి చెంది.. అక్కడే ప్రస్తుతం ఓ ద్విచక్రవాహనాల షోరూంకు యజమానిగా మారారు. సోదరుడు వినోద్‌కుమార్‌రెడ్డితో కలిసి వ్యాపారం చేస్తున్నారు. ఒకనాడు పేదరికంలో మగ్గిన తాము కష్టపడి మరమ్మతులు నేర్చుకొని నేడు తమ కుటుంబ సభ్యులను సంతోష పెట్టగలుగుతున్నామని పేర్కొన్నారు. మరో పది మందికి ఉపాధి కల్పిస్తుండటం సంతృప్తిగా ఉందని తెలిపారు.

ఉపాధికి కొన్ని పథకాలు

పీఎం స్వనిధి: కరోనా సమయం ప్రతి ఒక్క వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రధానంగా వీధి వ్యాపారాలు కోలుకోలేని దెబ్బతిన్నాయి. వీధి వ్యాపారులను గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. పూచికత్తు లేకుండా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాన్ని ఇస్తారు. వ్యాపారాభివృద్ధి చేసుకోవచ్చు.

కార్పొరేషన్ రుణాలు: ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ రుణాలతో రాష్ట్ర ప్రభుత్వం వాహనాలు, వ్యాపారాలకు ఇస్తున్నారు. రాయితీలు ఉన్నాయి.

బ్యాంకు లింకేజీ: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అతి ప్రధానమైన పథకాల్లో బ్యాంకు లింకేజి ఒకటి. ఇది గ్రామాల, పట్టణాల మహిళలను స్వయం సహాయక సంఘాల పేరుతో గ్రూప్‌లుగా చేసి వారికి తక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తుంది. సులభంగా తిరిగి చెల్లించవచ్చు. వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవచ్చు.

శ్రీనిధి: స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీనిధి పేరుతో పథకం తెచ్చింది. పాడి పశువులకు, మేకలు, కిరాణం, పౌల్ట్రీలకు రుణాలు ఇస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చు.

రాజస్థాన్ సదస్సుకు పొట్లపల్లి విద్యార్థి ఎంపిక



కల్లెపల్లి ప్రశాంత్

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: రాజస్థాన్‌లోని మహారాజా గంగాసింగ్ విశ్వవిద్యాలయంలో జరిగే 61వ ఆలిండియా రాజనీతి శాస్త్రం అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన పరిశోధక విద్యార్థి కల్లెపల్లి ప్రశాంత్‌కు దక్కింది. ఆయన ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యాభ్యాసాన్ని హుస్నాబాద్, వరంగల్‌లో పూర్తి చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్ రాంచంద్రం పర్యవేక్షణలో 'తెలంగాణలో షెడ్యూలు తెగల రిజర్వేషన్ల ప్రభావం' అంశంపై పరిశోధన చేస్తున్నారు. ఈ నెల 18, 19 తేదీలలో రాజస్థాన్ సెమినార్‌లో పాల్గొంటారు. అందులో 'భారతదేశంలో మారుతున్న ప్రజాస్వామ్యం, రాజకీయ అవకాశాల పరిమితులు' అంశంపై ప్రసంగిస్తారు. 'వికసిత్ భారత్ 2047'లో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ప్రశాంత్‌ను గ్రామస్థులు, అధ్యాపకులు అభినందించారు.



ఉదయ భానుడు

చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన చిత్రం కాదిది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట గ్రామ శివారులో తెల్లవారుజామున ఉదయిస్తున్న సూర్యుడు. గ్రామ శివారులోని కొండల మధ్య నుంచి జ్వాలను తలపించే వెలుగుతో పైపైకి భానుడు వస్తున్నాడు.

– న్యూస్‌టుడే, చిలప్‌చెడ్

బసవేశ్వర ఉత్సవం.. తరలుతున్న భక్తజనం



బసవకల్యాణ్‌లో 108 అడుగుల విగ్రహం

న్యూస్‌టుడే, జహీరాబాద్: మానవతావాది, లింగాయత్, బసవ ధర్మీయుల ఆరాధ్య దైవం బసవేశ్వరుడికి ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు 'కల్యాణపర్వ' ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటికి జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, సంగారెడ్డి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్తున్నారు. జహీరాబాద్‌కు 90 కిలో మీటర్ల దూరంలో బసవకల్యాణ్ ఉంది. ఎత్తైన గుట్టపైన, పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్యలో 21 ఎకరాల స్థలంలో 108 అడుగుల భారీ విగ్రహాన్ని 2014లో నిర్మించారు. ఆ ప్రాంతానికి 'శరణుశైల'గా నామకరణం చేసి ఏడాదికోసారి కల్యాణ పర్వాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ గుహలు, సొరంగం, బసవేశ్వరుడి బోధనల చిత్రాలు ఉన్నాయి. జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ ప్రధాన కూడళ్ల వద్ద బసవేశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామాలలో బృందాలుగా ఏర్పడి ప్రత్యేక వాహనాలు సమకూర్చుకొని బయలుదేరారు.

భోజన, వసతి ఏర్పాట్లు చేశాం:



–శంకర్ పాటిల్, రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు

బసవకల్యాణ్ పట్టణంలో మూడు రోజుల పాటు జరుగు కల్యాణపర్వానికి మన ప్రాంతం నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో రానున్నందున తగిన వసతి ఏర్పాట్లు పూర్తిచేశాం. భోజన, వసతి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి కల్యాణపర్వం కార్యక్రమం గురించి భక్తులకు తెలియజేశాం. జహీరాబాద్-ముంబయి జాతీయ రహదారిపై ఉన్నందున రాకపోకలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి దుర్మరణం



సుకూరి భాగయ్య

దుబ్బాక: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన దుబ్బాక శివారులోని పెద్దచీకోడ్ మార్గంలో బుధవారం చోటుచేసుకుంది. మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన రైతు సుకూరి భాగయ్య(50), భార్య ఎల్లవ్వతో కలిసి దుబ్బాక మండలంలోని పెద్దచీకోడ్‌లోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వచ్చారు. సాయంత్రం భార్యతో కలిసి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పోతారానికి చెందిన గడీల శ్రీనివాస్‌రెడ్డి దుబ్బాకలో పని ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. పెద్దచీకోడ్ వెళ్లే దారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో సుకూరి భాగయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు, శ్రీనివాస్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఫిర్యాదు అందలేదని దుబ్బాక పోలీసులు తెలిపారు.


ఉద్యోగం పేరుతో మోసం

హైదరాబాద్: ఉద్యోగం పేరుతో డబ్బులు దండుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. హైదరాబాద్ మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన వైష్ణవి టెలీకాలర్‌గా పనిచేస్తూ.. మధురానగర్‌లోని యోగితా లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. గతంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కమ్మరి వీరేందర్ పరిచయమయ్యాడు. ఉద్యోగం కల్పిస్తానని నమ్మించాడు. ఆగస్టు 8న క్విక్ సన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ కంపెనీలో ఇంటర్వ్యూ నిర్వహించి వెబ్ డిజైనర్‌గా ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పారు. డబ్బులు కట్టనిదే ఉద్యోగం రాదని, పలువురికి ఇవ్వాల్సి ఉంటుందని వీరేందర్ చెప్పడంతో ఆగస్టు 12 నుంచి ఈనెల 9 వరకు దఫదఫాలుగా రూ. 3.5 లక్షలు చెల్లించింది. మరిన్ని డబ్బులకు వేధిస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్య తిరిగి రాలేదని మేస్త్రీ ఆత్మహత్య

వికారాబాద్, న్యూస్‌టుడే: దసరా పండుగకు పుట్టింటికి వెళ్లిన భార్యాపిల్లలు చిన్నపాటి మనస్పర్థలతో కాపురానికి రాకపోవడంతో ఒంటరిగా మిగిలాడు. మద్యం తాగిన మత్తులో భార్యాపిల్లలు గుర్తుకు వచ్చి ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ మండలం సిద్దులూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. వికారాబాద్ ఎస్‌ఐ సత్యనారాయణరాజు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలూకాకు చెందిన ఉప్పరి శ్రీకాంత్ (37), రేణుక దంపతులకు సంజన, స్వాతి, బస్వరాజ్, రితీష్‌లు సంతానం. బతుకుతెరువు కోసం ఏడాది కిందట భార్యాపిల్లలతో వచ్చి సిద్దులూర్ శివారులోని ఓ వ్యవసాయక్షేత్రంలో ఉంటున్నారు. మేస్త్రి పనిచేసే శ్రీకాంత్ తరచూ మద్యం తాగి భార్యతో గొడవపడేవాడు. దసరా పండుగకు అందరూ కలిసి సంతోషంగా సొంత గ్రామానికి వెళ్లారు. పండుగ అనంతరం భర్తతో సిద్దులూర్‌కు తిరిగి రావడానికి భార్య అంగీకరించలేదు. తీరు మార్చుకుంటేనే పుట్టింటికి వస్తానని వాదనకు దిగింది. అయినా లెక్క చేయకుండా భార్యాపిల్లలను అక్కడే వదిలేసి వచ్చాడు. ఒంటరితనం భరించలేక మద్యం మత్తులో వ్యవసాయక్షేత్రంలోని గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాపాడండీ..



జగదేవపూర్ మండలం తీగుల్ పరిధిలోని పురాతన ప్రార్థన మందిరం

అయ్యలారా.. అమ్మలారా.. మేము చారిత్రక ఆధారాలం. శతాబ్దాల కాలంలో అప్పటి రాజులు తమ అవసరాల కోసం పటిష్ఠంగా నిర్మించారు. ఇప్పటి వరకూ చెక్కుచెదరకుండా ఉన్నాం. ప్రస్తుతం మామీద మొక్కలు, తీగలు పెరిగి, వేళ్లూనుకుంటూ మా పటిష్టతకు భంగం కలిగిస్తున్నాయి. ప్రజలారా.. మీరు ప్రజాప్రతినిధుల ద్వారానో, అధికారుల ద్వారానో, స్వచ్ఛందంగా సేవలు అందించే యువజన సంఘాలతోనో మమ్ములను మీ భవిష్యత్తు కోసం కాపాడండి. పరిసరాల్లో వ్యర్థాలు లేకుండా.. మొక్కలు పెరగకుండా శుభ్రం చేస్తే మీ ఊరికి మేము గుర్తింపు కలిగిస్తామని మరువొద్దు. చరిత్ర సాక్ష్యాలు లేకుంటే భవిష్యత్తు ప్రణాళికలు సక్రమంగా వేయడం కుదరదని గమనించండి. శిథిలం కాకముందే సరి చేయండి.

ఇట్లు మీ ...

సంగారెడ్డి జిల్లా అందోలులో గైని (గడీల ద్వారం), రెడ్డి రాజుల కాలం సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్‌లో రెండో నిజాం నవాబు నిర్మించిన ప్రార్థన మందిరం

– న్యూస్‌టుడే, జోగిపేట టౌన్, జగదేవపూర్



అందోలులో గడీ ప్రధాన ద్వారంపై చెట్లు

పండుగకు తల్లిగారింటికి పంపలేదని వివాహిత బలవన్మరణం



సౌమ్య

చేర్యాల, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగకు తల్లిగారింటికి పంపలేదన్న కారణంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన చేర్యాల మండలం ఆకునూరులో జరిగింది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాలు.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లికి చెందిన ముక్కెల మంజుల-రాంరెడ్డిల కుమార్తె సౌమ్య(22)ను నాలుగేళ్ల క్రితం ఆకునూరుకు చెందిన పెంటపర్తి శ్రావణ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వారికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. పండుగకు సౌమ్యను ఆమె భర్త పుట్టింటికి పంపలేదు. మనస్తాపానికి గురైన ఆమె క్షణికావేశంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు ఆమెను చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తల్లి మంజుల ఫిర్యాదు చేశారు.

బోధన వృత్తికి పట్టం.. అక్కన్నపేట విశేషం

- అక్కన్నపేటలో జనాభా 4,545
- 2012 డీఎస్సీలో గ్రామం నుంచి అత్యధికంగా 14 మంది అర్హులు కావడం విశేషం
- గ్రామంలో 1960 నుంచి ప్రభుత్వ ఉద్యోగులు 140
- ప్రస్తుతం ఉపాధ్యాయులు 50 మంది ఉన్నారు.
- ప్రైవేటు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా ఉన్నారు.

రామాయంపేట, న్యూస్‌టుడే: ఎవరో ఒకరు. . ఎపుడో అపుడు.. ఒకరిని చూసి మరొకరు అన్నట్టుగా ఆ ఊరిలో అందరూ ఉద్యోగాల బాటలో పయనిస్తున్నారు. ఒకరు ఒక ఇద్దరు కాదు.. ఏకంగా 100 మందికి పైగా ఉద్యోగాలు సాధించడం విశేషం. రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటలో 1,010 కుటుంబాలు ఉన్నాయి. ఊరిలో అన్ని వర్గాల వారు ఉన్నారు. అధికంగా ప్రభుత్వ ఉద్యోగాల వైపు అందులోనూ ఉపాధ్యాయులుగా స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలు నిదర్శనం.


ప్రతి డీఎస్సీలోను చోటు

సాధారణంగా గ్రామంలో ఒకరికి ఉద్యోగం వచ్చిందంటే అందులో ప్రభుత్వ ఉద్యోగం ఉంటే ఊరందరికీ తెలిసిపోతుంది. అక్కన్నపేట గ్రామంలో మాత్రం అవి సర్వసాధారణమే. ప్రతి డీఎస్సీలోను ఒకరికి మించి సాధిస్తుండటం విశేషం. ఇలా ఇప్పటివరకు 50 మంది ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎస్జీటీలో ఇద్దరు.. స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ జిలాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు.

స్వయంపాలన దినోత్సవ స్ఫూర్తి

పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా వ్యవహరించడం స్ఫూర్తి నింపింది. ఆ ఒక్క రోజే కాకుండా ఉపాధ్యాయులుగా ఎదగాలన్న ఆకాంక్ష కలిగిందంటారు.. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామచందర్. 1982లో ఉపాధ్యాయుడిగా అర్హత సాధించిన ఆయన స్ఫూర్తితో గ్రామంలో ఇప్పటివరకు 50 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు.

నిపుణులను తయారు చేసేది బోధన వృత్తి



ఉపాధ్యాయ వృత్తి స్వచ్ఛమైనది. సమాజంలోని అన్ని రంగాల్లోనూ నిపుణులను తయారు చేసేది ఉపాధ్యాయులే. భవిష్యత్తు తరాన్ని సవ్యదిశలో నడిపించేది ఈ వృత్తే. గ్రామంలో బోధననే ఎంచుకోవాలని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నా.

రామచందర్, విశ్రాంత ఉపాధ్యాయుడు

గిరిపుత్రుడు.. గెలుపు కెరటం

- జమ్మూకశ్మీర్‌లో ఎఫ్‌సీఐ జీఎంగా ప్రస్థానం



సేంద్రియ ఎరువుతో పూల సాగు

న్యూస్‌టుడే, నర్సాపూర్: వారిది నిరుపేద గిరిజన కుటుంబం.. వ్యవసాయం చేస్తేనే పూట గడిచే రోజులవి. పరిస్థితులకు తలవంచలేదు. ఏదో సాధించాలనే తపన... లక్ష్యం చేరుకోవాలనే పట్టుదల... ఎన్ని అవాంతరాలు ఎదురైనా విజయం సాధించే వరకు విశ్రమించలేదు. నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ తండాకు చెందిన ఛత్రునాయక్ ఉన్నతంగా ఎదిగారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లోని భారత ఆహార సంస్థలో (ఎఫ్‌సీఐ) జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు.

మహ్మదాబాద్ తండా నుంచి..

నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ తండాకు చెందిన లున్సావత్ మున్నిభాయ్, తుక్యాల మొదటి కుమారుడైన ఛత్రునాయక్‌కు కాలినడకన బడికి వెళ్లి చదువుకోవాలన్నా సరైన దారి లేక చాలా కష్టంగా ఉండేది. నర్సాపూర్‌కు నడుస్తూ వెళ్లి పదో తరగతి చదివారు. హాలియాలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్ జెఎన్టీయూలో పీజీ పూర్తిచేశాక 1989లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో టెక్నికల్ అధికారిగా కేంద్రం ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. 1977లో ఎఫ్‌సీఐలో సహాయ మేనేజర్‌గా బెంగళూరులో పనిచేశారు. హైదరాబాద్, నల్గొండ, తార్నాక, కరీంనగర్‌లో మేనేజర్‌గా చేశారు. డీజీఎంగా పదోన్నతి లభించడంతో అస్సాం, గవుహాటిల్లో విధులు నిర్వహించారు. జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది ముంబయికి బదిలీ అయ్యారు. మూడు సంవత్సరాల అనంతరం జమ్మూకశ్మీర్‌లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, గుజరాత్ రాష్ట్రాలకు జీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట 1.50 లక్షల టన్నుల బియ్యం సరఫరాకు సంబంధించి విధులు చేపడుతున్నారు.

సేంద్రియ సాగుపై మక్కువ

ఆయనకు సెలవు దొరికితే చాలు మహ్మదాబాద్ తండాకు వస్తారు. పొలాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తారు. బీర, కాకర, వంగ, బెండ, మిర్చి, తీగ జాతి కూరగాయలను రసాయనాలు లేకుండా పండిస్తున్నారు. పెద్దఎత్తున బంతి పూలను సాగు చేస్తున్నారు. తనకు జన్మనిచ్చిన గడ్డకు ఏదోఒకటి చేయాలనే తపన ఆయనది. ప్రస్తుతం తాజామాజీ ఎంపీటీసీ సంధ్యారాణి ఛత్రూనాయక్ భార్య. కుమారుడు యువహీరో అనురాగ్. 15 ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేశారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

చేగుంట, న్యూస్‌టుడే: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం వడియారం శివారులో బుధవారం జరిగింది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. వడియారం-మాసాయిపేట రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇతనికి సంబంధించినవారు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో రైతు..

తొగుట, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తొగుట మండలం కాన్గల్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. తొగుట ఎస్సై రావికాంతరావు కథనం ప్రకారం.. ముడికే యాదయ్య(40) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని ముచ్చర్ల నర్సయ్యకు చెందిన వ్యవసాయ భూమివద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00

ప్రమాదకర స్తంభం తొలగింపు

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ఈనెల 16న ఈనాడులో ప్రచురితమైన 'కరెంటు కష్టాలు తీరేదెన్నడో' అనే కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు బుధవారం స్పందించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. రుద్రారం గ్రామశివారులో నియంత్రికకు కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుబ్బాక ఏడీఏ గంగాధర్ మాట్లాడుతూ.. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలతో పాటు కంచె లేని నియంత్రికలను సరిచేస్తామన్నారు. సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట ఏఈలు శ్రీకాంత్, కనకయ్య ఉన్నారు.

చినుకు పడితే.. చిత్తడే



ముట్రాజ్‌పల్లి రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

న్యూస్‌టుడే, ఆఫీసర్ కాలనీ(గజ్వేల్): చిన్నపాటి వర్షానికే పట్టణంలోని ఆఫీసర్ కాలనీలో రోడ్లపై వర్షపు నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవటం, రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చకపోవడంతో నిత్యం వర్షపు నీరు, బురద కష్టాలు పడుతున్నామంటున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో వర్షపునీరు ఇళ్లలోకి చిమ్ముతున్నాయని పలువురు మహిళలు వాపోతున్నారు. కాలనీలో దాదాపు వందకుపైగా నివాసాలున్నాయి. అక్కడికి వెళ్లేందుకు సీసీ రోడ్లతోపాటు బీటీ రోడ్లున్నాయి. వర్షం నీరు వెళ్లే ఏర్పాట్లు చేసి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆగిన పనులు.. సాగేనా!

మరమ్మతులు నిలిచిపోవడంతో తప్పని దారి కష్టాలు



గుంతలుగా మారిన మెట్టు-అల్వాల రోడ్డు

న్యూస్‌టుడే, తొగుట: పల్లెల అభివృద్ధిలో రహదారుల పాత్ర ఎంతో కీలకం. మట్టి దారులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం తారురోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన గుత్తేదారు కొంతదూరం పూర్తిచేసి చేసిన పనులకు బిల్లులు రావడం లేదని మధ్యలోనే వదిలేశారు. సిద్దిపేట, తొగుట, దౌల్తాబాద్, మిరుదొడ్డి, రాయపోల్ మండలాలను అనుసంధానం చేసే కీలక రహదారి మరమ్మతు పనులు ఆగిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అసంపూర్తిగా నిలిచిన రహదారి పనులపై కథనం..

రహదారి వివరాలు	
మంజూరైన నిధులు	రూ.18 కోట్లు
మరమ్మతు చేయాల్సిన దూరం	12 కి.మీ.
చేసిన పనులు	6.5 కి.మీ.
ఇంకా చేయాల్సిన దూరం	5.5 కి.మీ.

కొంతదూరం చేసి.. మధ్యలో వదిలేసి

తొగుట మండలం మెట్టు నుంచి మిరుదొడ్డి మండలం అల్వాల వరకున్న 12 కి.మీ. బీటీ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. పది నెలల కిందట పనులు ప్రారంభించిన గుత్తేదారు మెట్టు నుంచి గుడికందుల వరకు ఆరున్నర కిలోమీటర్ల పనులు పూర్తి చేయగా.. తొగుట మండలం గుడికందుల నుంచి అల్వాల వరకున్న ఐదున్నర కిలోమీటర్ల పనులను మధ్యలోనే వదిలేశారు. ఈ మార్గంలో రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. చేసిన పనులకు నిధులురాక గుత్తేదారు పనులు నిలిపివేశారు.

పలు గ్రామాలకు కీలక మార్గం

ఈ రోడ్డు సిద్దిపేట, తొగుట, దౌల్తాబాద్, మిరుదొడ్డి, రాయపోల్ మండలాలను అనుసంధానం చేస్తుంది. అనేక గ్రామాలకు కీలకమైన మార్గం కావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఒకవేళ వేరే మార్గంలో వెళ్లాలంటే.. చాలా దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోంది. నిలిచిన రహదారి మరమ్మతు పనులను వెంటనే పూర్తిచేసి ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే చేపడతాం

– వెంకటేశ్, డీఈ, ర.భ.శాఖ.

గత శాసనసభ ఎన్నికల ముందు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించాం. ఆరున్నర కి.మీ. మేర చేసిన పనులకు డబ్బులు రాక గుత్తేదారు పనులు నిలిపేశారు. ఈ విషయమై గుత్తేదారుతో సంప్రదింపులు జరుపగా త్వరలోనే పనులు చేపడుతామని చెప్పారు.

పోటీ ప్రపంచంలో నైపుణ్యం అవసరం: ఎమ్మెల్యే



రాజేశ్వరి, చందులను అభినందిస్తున్న కొత్త ప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ అన్నిరంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా రోడ్లు, భవనాలశాఖ ఏఈలుగా ఎంపికైన మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామానికి చెందిన అక్క, తమ్ముళ్లు రాజేశ్వరి, చందులను బుధవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు: బల్దియా కమిషనర్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లో చెత్త వేయొద్దని బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. నాసర్‌పురాలో చెత్త సేకరణ వాహనం సరైన సమయానికి రావటం లేదన్న ఫిర్యాదుతో బుధవారం ఆయన సంబంధిత ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పిలిపించి ప్రతిరోజు సమయానికి వాహనం రావాలని ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ కాలనీకి వెళ్లారు. మురుగు కాల్వలపై స్లాబ్ నిర్మాణం వల్ల చెత్త, సిల్ట్ తొలగించటం ఇబ్బందిగా మారిందని, వెంటనే స్లాబ్ నిర్మాణాలు తొలిగించాలని ఆదేశించారు. తదుపరి కుషాల్ నగర్ పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలని పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనితను ఆదేశించారు. పట్టణంలోని వీధి కుక్కల జనన నియంత్రణ కేంద్రం, లింగారెడ్డిపల్లిలో సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని చూసి వివరాలు సేకరించారు. మున్సిపల్ అధికారులు ప్రేరణ, అన్వేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ పట్టణంలోని పలు పాఠశాలల్లో కొనసాగుతోంది. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఎమ్మెల్సీకి పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి ప్రక్రియను పర్యవేక్షించారు. ప్రతి ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదు కావాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

హుస్నాబాద్ గ్రామీణం, దుబ్బాక, జగదేవపూర్, రాయపోల్, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024లో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పోస్టుల్లో చేరారు. జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయుల్లో హుస్నాబాద్ మండలానికి 4గురు, అక్కన్నపేట మండలానికి 18 మందిని కేటాయించారు. ఈ మేరకు వారు బుధవారం అక్కన్నపేట మండలంలో 13, హుస్నాబాద్‌లో నలుగురు తమకు రిపోర్టు చేసినట్లు ఎంఈవోలు గుగులోతు రంగా, బి.మనీల తెలిపారు. దుబ్బాక మండలంలో ఏడుగురు, జగదేవపూర్‌లో 22 మంది, రాయపోల్‌లో 24 మంది ఎస్జీటీలు, 9 మంది స్కూల్ అసిస్టెంట్‌లు విధుల్లో చేరారని ఎంఈవోలు జోగు ప్రభుదాస్, మాధవరెడ్డి, సత్యానారాయణ రెడ్డి తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: కోహెడ మండలంలోని తంగళ్లపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంఈవో పద్మయ్య, కస్తూర్బా ప్రత్యేకాధికారిణి హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. కోహెడ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు ఈనెల 17 నుంచి 21 వరకు విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బహిరంగ కొనుగోళ్లపై చర్యలు తీసుకోరా?

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో వ్యాపారులు బహిరంగ కొనుగోళ్లు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కిసాన్‌సంఘ్ డివిజన్ ఇన్‌ఛార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇక్కడ పెద్ద మార్కెట్ అయినప్పటికీ యార్డులో క్రయవిక్రయాలు జరగడం లేదన్నారు. బహిరంగ కొనుగోళ్లలో రైతులను నిలువు దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు సంపత్ రావు, కార్యదర్శి ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

పల్లెవాగుపై చెక్‌డ్యాం నిర్మించండి



మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

చేర్యాల, న్యూస్‌టుడే: చేర్యాల మండలం ఆకునూరు శివారులోని పల్లెవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలని ఆ గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. చెక్‌డ్యాం నిర్మాణంతో వృథాగా పోయే వర్షం నీటికి అడ్డుకట్ట వేయడంతో పాటు, వాగుకు సమీపంలోని పోల్కమ్మ చెరువును గోదావరి జలాలతో నింపేందుకు అవకాశముంటుందని రైతులు పేర్కొన్నారు. స్పందించిన ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చిత్రాల ప్రదర్శన.. ఆహార వృథాపై అవగాహన



అర్జున్‌పట్లలో కూరగాయల చిత్రాలతో విద్యార్థులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలోని అభయ జ్యోతి మనోవికాస కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వృథాను అరికట్టే దిశగా ఆలోచించాలంటూ విద్యార్థులు ఫ్లకార్డులు ప్రదర్శించారు. నిర్వాహకుడు జోజి, లయన్స్ క్లబ్ సభ్యుడు వినోద్ మోదాని నిత్యావసర సరకులను కేంద్రానికి అందించారు.

చేర్యాల: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని చేర్యాల మండలం అర్జున్‌పట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఎం.రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో 13 రకాల కూరగాయల చిత్రాలను మెడలో వేసుకొని.. విద్యార్థులు వాటిలో ఉన్న పోషక విలువలు, వాటిని తింటే కలిగే ప్రయోజనాలను వివరించారు. చిన్నారుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గజ్వేల్ గ్రామీణ: పట్టణంలోని బాలుర విద్యా సౌధం ప్రాంగణంలో ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అంజుం మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు లావణ్య, భవాని, వెంకటేశ్వర్లు, కవిత, తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతపై పట్టు సాధించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సీసీటీఎన్ఎస్ నూతన వెర్షన్ 2.0పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని అదనపు డీసీపీ మల్లారెడ్డి సూచించారు. ఎప్పటికప్పుడు కేసుల వివరాలను అందులో నమోదు చేయాలన్నారు ఈ విషయంలో సాంకేతిక సిబ్బంది విధులు కీలకమన్నారు. కమిషనరేట్ పరిధిలో ఆయా పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న రిసెప్షన్ సిబ్బంది, టెక్ టీమ్ సిబ్బందికి బుధవారం కమిషనరేట్‌లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపిక గురించి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు వస్తే అవార్డులు, రివార్డులు తప్పకుండా వరిస్తాయన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యతలు నిర్వహించటంలో నిజాయితీ, పారదర్శకతకు జవాబుదారీగా ఉండాలన్నారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, ఐటీ సెల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



కుకునూరుపల్లిలో మాట్లాడుతున్న సీఐ లతీఫ్

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం), దుబ్బాక, గజ్వేల్ గ్రామీణ, ములుగు, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణ, కోహెడ, చేర్యాల, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. బుధవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. గజ్వేల్ మండల పరిధిలోని బయ్యారంలో గజ్వేల్ అదనపు సీఐ ముత్యం రాజు ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. దుబ్బాకలోని సరస్వతీ గ్లోబల్ పాఠశాలలో షీటీమ్స్ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, పోక్సో, సైబర్ నేరాలపై దుబ్బాక ఎస్సై వి.గంగరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ములుగు మండలం తునికిబొల్లారం ఉన్నత పాఠశాలలో ములుగు ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో, అక్కన్నపేట మండలం మల్లంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో, హుస్నాబాద్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఎస్ఐ తోట మహేశ్ ఆధ్వర్యంలో, నాగసముద్రాల ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో కోహెడ ఎస్సై అభిలాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేర్యాల మండలం ముస్త్యాలలో ఎస్సై నీరేశ్ ఆధ్వర్యంలో 'కనువిప్పు' కార్యక్రమం నిర్వహించారు.

బస్సు సౌకర్యాలపై జనగామ డీఎం ఆరా

చేర్యాల(ధూళ్మిట్ట, మద్దూరు), న్యూస్‌టుడే: పల్లెల్లో రవాణా సౌకర్యాలపై జనగామ డిపో మేనేజరు ఎస్.స్వాతి స్వయంగా సర్వే చేశారు. ఈ మేరకు మద్దూరు, ధూళ్మిట్ట మండలాల్లోని లద్నూరు, మద్దూరు, రేబర్తి, వల్లంపట్ల, బైరాన్‌పల్లి, కూటిగల్, కొండాపూర్ గ్రామాలను బుధవారం ఆమె సందర్శించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి ఆర్టీసీ సేవలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై అభిప్రాయాలను అడిగారు. ఉచిత సౌకర్యంతో రద్దీ పెరిగిందని, బస్సు సర్వీసులు సరిపోవడం లేదని, మరిన్ని బస్సులు పెంచాలని ప్రజలు ఆమెను కోరారు. గతంలో జనగామ నుంచి బైరాన్‌పల్లి వరకు ప్రతి రోజూ సాయంత్రం నడిచిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని బైరాన్‌పల్లి నాయకులు గందె మల్లేశం, ఉపేందర్, బాపురాజు, రాంరెడ్డి కోరారు. ఆమె వెంట డిపో కంట్రోలర్ టీబీఎస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ముందస్తు చర్యలతోనే గాలికుంటు వ్యాధి నివారణ



టీకా కార్యక్రమంలో పాల్గొన్న సహాయ సంచాలకులు వెంకటరెడ్డి, రైతులు

హుస్నాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు వెంకటరెడ్డి కోరారు. బుధవారం హుస్నాబాద్ పురపాలిక పరిధిలోని ఆరెపల్లిలో పశువులకు ముందస్తుగా వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌన్సిలర్ మ్యాదరబోయిన వేణుయాదవ్, పశువైద్యాధికారి విజయ, కాశబోయిన సంపత్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు పోలీసు సైరన్లు బిగిస్తే చర్యలు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రైవేటు వాహనాలకు అనుమతి లేకుండా పోలీసు సైరన్లు ఏర్పాటు చేసుకుంటే చర్యలు తప్పవని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు పట్టణంలోని పలు కార్ డెకార్ దుకాణ నిర్వాహకులకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా సైరన్లు బిగించుకోవద్దని, ఎవరైనా బిగించాలని వచ్చి ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఉమేశ్ తదితరులు ఉన్నారు.

అటవీ సెక్షన్ అధికారి మృతి



దస్తగిరి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: బాన్సువాడ అటవీ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న నిజాంసాగర్ సెక్షన్ అధికారి (ఎఫ్ఎస్‌వో) గులాం దస్తగిరి(58) విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై చనిపోయారు. వివరాలిలా.. రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం విధులకు వచ్చారు. ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో బాన్సువాడ పట్టణంలోని ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఈయన స్వస్థలం సిద్దిపేట జిల్లా ములుగు. రెండేళ్ల కిందట పదోన్నతిపై బాన్సువాడ రేంజ్‌కు వచ్చారు. కామారెడ్డి జిల్లా అటవీ అధికారి నిఖిత, ఇన్‌ఛార్జి డివిజన్ అధికారి రామకృష్ణ, రేంజ్ అధికారి హబీబ్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

మందుల కొరతతో రోగుల ఇబ్బందులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రి, బస్తీ దవాఖానాలో నెల రోజులుగా రక్తపోటు, మధుమేహం మాత్రల కొరతతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ తెలిపారు. బుధవారం పార్టీ నాయకులతో కలసి ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షల నిర్వహణకు ఆధునిక యంత్రాల ఏర్పాటుకు కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సంజీవరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఉన్నారు. ఇదే విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డి వివరణ కోరగా.. మందుల కొరత లేదని తెలిపారు.

నేషనల్ కాంగ్రెస్ వారియర్స్ జిల్లా అధ్యక్షుడిగా అశోక్

దుబ్బాక: నేషనల్ కాంగ్రెస్ వారియర్స్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లికి చెందిన గజభీంకార్ అశోక్ నియమితులయ్యారు. నేషనల్ కాంగ్రెస్ వారియర్స్ జాతీయ ఛైర్మన్ కులదీపక్ జోషి, జాతీయ అధ్యక్షుడు అశ్విన్ మానే ఆదేశాల మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నవాజ్ చేతుల మీదుగా అశోక్ నియామక పత్రం అందుకున్నారు.

మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

హుస్నాబాద్ గ్రామీణం: ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదన్‌మహారాజ్ కోరారు. బుధవారం హుస్నాబాద్‌లో ఈ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

27 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు


హుస్నాబాద్ గ్రామీణం: ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో మొత్తం 27 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు బొలిశెట్టి శివయ్య, సీఈవో తిరుమల తెలిపారు.

పటిష్ఠ బందోబస్తు మధ్య అంత్యక్రియలు

చేర్యాల(ధూళ్మిట్ట), న్యూస్‌టుడే: నాలుగు రోజుల క్రితం అదృశ్యమై.. రెండు రోజుల కిందట శవమైన ధూళ్మిట్ట మండలం బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి అంత్యక్రియలు బుధవారం సాయంత్రం పోలీసు బందోబస్తు మధ్య ముగిశాయి. అతని మృతిపై అనుమానంతో పోలీసులు పక్క గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని రెండు రోజుల క్రితమే అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దీంతో ముందు జాగ్రత్తగా పోలీసులు రెండు గ్రామాల్లో ఉదయం నుంచి బందోబస్తు నిర్వహించారు. అనుమానితుడి ఇంటి వద్ద సైతం పోలీసులు రాత్రి వరకు పహారా ఏర్పాటు చేశారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు బుధవారం జిల్లా సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా పదకొండు మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.22,000 జరిమానా విధించారు.



పిడుగుపాటుకు ఎద్దుల మృత్యువాత

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: పిడుగుపాటుకు ఇందుప్రియాల్ గ్రామంలోని రైతు రాములుకు చెందిన రెండు ఎద్దు బుధవారం ఉదయం మృత్యువాతపడ్డాయి. రైతు తన పొలం వద్ద ఎడ్లను చెట్టుకు కట్టేసి ఇంటికి వచ్చారు. ఇంతలో వర్షం కురిసి చెట్టు వద్ద పిడుగు పడటంతో ఈ ఘటన జరిగింది. వర్షం వెలిసిన తర్వాత రాములు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా ఎద్దులు మృతి చెందడంతో బోరున విలపించారు. సంబంధిత అధికారులు వివరాలు సేకరించారు.

విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడి రిమాండ్

వర్గల్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వర్గల్ మండలం సింగాయిపల్లిలో పెద్దమ్మ తల్లి విగ్రహాలు ధ్వంసం చేసిన నిందితుడు కప్పోజి వెంకటస్వామిని బుధవారం గౌరారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ సీఐ మహేందర్ రెడ్డి, గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డితో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. వెంకటస్వామి మద్యం మత్తులో మంగళవారం రాత్రి గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయంలో పలు విగ్రహాలు ధ్వంసం చేసినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించినట్లు చెప్పారు. సంఘ విద్రోహక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బకాయిలు చెల్లించాలని ఆర్డీవోకు వినతి

గజ్వేల్, న్యూస్‌టుడే: విద్యార్థులకు రావాల్సిన ఉపకార వేతనాలు, బోధనా రుసుములను వెంటనే విడుదల చేయాలని ఇంటర్, డిగ్రీ కళాశాలల యజమానుల సంఘం, విద్యార్థులతో కలిసి బుధవారం గజ్వేల్‌లో ఆర్డీవో బన్సీలాల్‌కు వినతి పత్రం అందజేశారు. బకాయిలు పేరుకుపోవడంతో సిబ్బంది జీతాలు చెల్లిస్తూ కళాశాలను నడిపించటం ఇబ్బందిగా మారిందన్నారు.

సిద్దిపేట అర్బన్: పెండింగ్‌లో ఉన్న బోధన రుసుము, ఉపకార వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి అభిషేక్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడారు. నవదీప్, హర్షవర్ధన్ తదితరులున్నారు.


నీటి వృథా.. తప్పని వ్యథ!



ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తోంది. కానీ కొన్ని చోట్ల విలువైన నీరు వృథాగా పోతోంది. అరికట్టాల్సిన యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. కోహెడ మండలంలోని తంగళ్లపల్లిలో మూడు రోజులుగా పైపు నుంచి నీరు కారుతున్నప్పటికీ మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుమీద పారుతుండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ లీకవుతున్న నీరు దూరంలో ఉన్న మురుగు కాలువలోకి వృథాగా చేరుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

చకచకా ప్రయాణ ప్రాంగణాల నిర్మాణం



ప్రజ్ఞాపూర్‌లో బస్టాండు

న్యూస్‌టుడే, గజ్వేల్: గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో బస్టాండు సౌకర్యం లేక ఇన్నాళ్లు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజూ ఇక్కడి నుంచి 25 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సమస్యను గుర్తించిన ప్రభుత్వం గజ్వేల్‌లో చిన్న బస్టాండుకు రూ.2.56 కోట్లు, ప్రజ్ఞాపూర్ బస్టాండుకు రూ.3.81 కోట్లు మంజూరు చేయగా 2023 ఆగస్టులో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.

ఆర్టీఏ కార్యాలయంగా బస్టాండ్

పట్టణానికి 3 కి.మీ. దూరంలో ఉన్న పెద్దబస్టాండును గతంలో సుమారు రూ.5 కోట్లతో తూప్రాన్ రోడ్డులో నిర్మించారు. పట్టణానికి దూరంగా ఉండటంతో ఆర్టీఏ కార్యాలయంగా మార్పు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. బస్టాండు శిథిలావస్థకు చేరకముందే విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన సౌకర్యాలు కల్పించి ఆర్టీఏ కార్యాలయంగా వాడుకునే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.